సాక్షి రంగారెడ్డి

శుక్రవారం ı 27 ı డిసెంబర్ ı 2024



పర్యవేక్షణ కరువు

నియోజకవర్గ కేంద్రమైన ఇబ్రహీంపట్నం ఠాణాలో స్టేషన్‌హౌస్ అధికారి లేక ఇబ్బందులు తప్పడం లేదు. 8లో▸



ప్రాణం తీసిన..

వివాహేతర సంబంధాన్ని ప్రశ్నించినందుకు భర్త విచక్షణా రహితంగా కర్రతో దాడి చేయడంతో భార్య మృతి చెందింది. 8లో▸



ఊరుకోరు!

బాధ్యులుగా తేలితే అధికారులపైనా చర్యలకు సిఫార్సు చేయాలని హైడ్రా నిర్ణయించింది. 8లో▸

న్యూస్‌రీల్

ప్రధాని హోదాలో పలుమార్లు జిల్లాకు..



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రధాని హోదాలో మన్మోహన్‌సింగ్ పలుమార్లు జిల్లాలో పర్యటించారు. 2004 నవంబర్ 15న చేవెళ్ల మండలం ఆలూరుకు వచ్చారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ఇక్కడి నుంచే ప్రారంభించారు. 2006 జనవరి 3న శంషాబాద్ సమీపంలోని కిషన్ గూడ కేంద్రంగా నిర్వహించిన ఔటర్ రింగ్‌రోడ్డు పనుల శంకుస్థాపనకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2013లో దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల ఘటనలో గాయపడి యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించేందుకు నగరానికి వచ్చారు.

సోషలిజమే ప్రత్యామ్నాయం



ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న సీపీఐ నాయకులు

మీర్‌పేట: దేశంలో అందరికీ సమాన హక్కులు, సమ సమాజం రావాలంటే సోషలిజమే ప్రత్యామ్నాయమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు అజీజ్‌పాషా అన్నారు. లెనిన్‌నగర్‌లోని మండల కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన పార్టీ శతవసంత ఆవిర్భావ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో ఆర్థిక అసమానతలు పెరిగిపోవడంతో పేదవారు మరింత పేదవారిగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో ప్రజల తరఫున పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు శివనాయక్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

వేంనరేందర్‌రెడ్డిని కలిసిన చేవెళ్ల ఎమ్మెల్యే



వేంనరేందర్‌రెడ్డిని సన్మానించిన కాలె యాదయ్య, మధుసూదన్‌రెడ్డి

చేవెళ్ల: ముఖ్యమంత్రి సలహాదారు వేంనరేందర్‌రెడ్డిని చేవెళ్ల ఎమ్మెల్యే కాలెయాదయ్య, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.గురువారం వేంనరేందర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆయన నివాసానికి వెళ్లి శాలువ కప్పి సన్మానించారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

అది మా అధికారిక వెబ్‌సైట్ ప్రకటన కాదు: అనుదీప్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ కలెక్టరేట్ నుంచి కొత్త మీ సేవ కేంద్రాల గురించి ఎటువంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంత మంది అనధికార వ్యక్తులు 'మీ సేవ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం' అనే పేరుతో నకిలీ ప్రకటనను సృష్టించారని, https:// meesevatelangana.in అనే నకిలీ వెబ్‌సైట్ ప్రారంభించారని తెలిపారు. ఇది తమ అధికారిక మీ సేవ వెబ్‌సైట్‌కు ప్రతిరూపంగా ఉందన్నారు. అక్రమార్కులు కొత్త మీ సేవ కేంద్రాల కేటాయింపుల కోసం డిపాజిట్లు కూడా సేకరిస్తున్నట్లు తెలిసిందన్నారు. ప్రజలు ఇలాంటి నకిలీ ప్రకటనలు, వెబ్‌సైట్‌లను నమ్మొద్దని, జిల్లా పరిపాలన ద్వారా మాత్రమే జారీ చేసిన అధికారిక సమాచారాన్ని అనుసరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నకిలీ ప్రచారాన్ని నమ్మొద్దు

సాక్షి, సిటీబ్యూరో: పెండింగ్ ట్రాఫిక్ ఈ- చలాన్లపై రాయితీ ఇస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతున్న ప్రకటనలు నమ్మకూడదని హైదరాబాద్ పోలీసులు సూచించారు. ఎలాంటి డిస్కౌంట్లు, ఆఫర్లను ప్రకటించలేదని, అదంతా నకిలీ ప్రచారమని స్పష్టం చేశారు. హెచ్‌టీటీపీఎస్://ఈచలాన్.టీఎస్‌పోలీస్.జీఓవీ.ఇన్/పబ్లిక్‌వ్యూ/అధికారిక వెబ్‌సైట్, సోషల్ మీడియా వేదికల ద్వారా మాత్రమే ఎలాంటి ప్రకటనలైనా జారీ చేస్తామని తెలిపారు. నకిలీ ప్రకటనలను నమ్మకూడదని, అధికారికంగా నిర్ధారించుకోకుండా నకిలీ మెసేజ్‌లను ఇతరులకు ఫార్వార్డ్ చేయడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. పెండింగ్ ఈ-చలాన్లు, ఇతరత్రా వివరాల కోసం 040-27852772, 27852721 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రసవత్తర.. రాజకీయం

YEAR 2024 Political ROUNDUP





అధికార మార్పుతో మారిన సమీకరణాలు

- అన్ని పార్టీల నుంచి పెరిగిన వలసలు
- మంత్రి మండలిలో దక్కని ప్రాతినిధ్యం
- కార్పొరేషన్ పదవుల్లో జిల్లా నేతలకు పెద్దపీట
- కొన్ని పార్టీలకు తీపి.. మరికొన్నిపార్టీలకు చేదు

మున్సిపాలిటీల్లో 'అవిశ్వాస' పర్వం

మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో రాజకీయ సమీకరణాలు ఒక్కసారిగా మారిపోయాయి. బీఆర్ఎస్ మద్దతుతో చైర్మన్/ మేయర్ పీఠాలు దక్కించుకున్న వారు ఆ తర్వాత అవిశ్వాస తీర్మానాలతో ఆయా పదవులను కోల్పోవాల్సి వచ్చింది. ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, పెద్ద అంబర్‌పేట్, తుక్కుగూడ, నార్సింగి, బండ్లగూడ జాగీర్‌లో మార్పులు, చేర్పులు చోటు చేసుకోవడం గమనార్హం. మొత్తంగా 2024 సంవత్సరం కొందరికి తీపిని పంచగా.. మరికొందరికి చేదు జ్ఞాపకాలను మిగిల్చింది.

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అనేక రాజకీయ శిబిరాలు.. వలసలకు జిల్లా ఈ ఏడాది వేదికైంది. గత ఏడాది చివరిలో అసెంబ్లీకి జరిగిన ఎన్నికలు రాజకీయ ముఖ చిత్రాన్ని పూర్తిగా మార్చేశాయి. జిల్లా చరిత్రలోనే తొలిసారిగా చేవెళ్ల ఎంపీ సీటును బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సొంతం చేసుకున్నారు. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన మాజీ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి ఈ ఎన్నికల్లో ఘోరపరాజయం పాలయ్యారు.

సరిగ్గా లోక్‌సభ ఎన్నికలకు ముందు మాజీ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి సహా జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఆమె మామ మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఆ తర్వాత రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సహా చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ.. ఇలా ఒకరి తర్వాత మరొకరు బీఆర్ఎస్‌ను వీడి అధికార కాంగ్రెస్‌లో చేరారు. అప్పటికే రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఆర్ఎ

కొనసాగిన వలసలు

స్.. ఆ తర్వాత ఎమ్మెల్యేలు, కీలక నేతలు పార్టీని వీడడంతో మరింత బలహీనపడింది. లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థులు కూడా దొరకని పరిస్థితిలో మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్‌నురంగంలోకి దింపింది. అయినా నిరాశ తప్పలేదు. 2014 నుంచి బీఆర్ఎస్‌కు కంచుకోటలా మారిన చేవెళ్ల ఈ ఎన్నికల్లో మూడో స్థానానికి పరిమితమైంది. వలసలు పెరగడంతో అధికార కాంగ్రెస్ పార్టీ 'హస్త'వ్యస్తంగా తయారైంది. పాత, కొత్త నేతల మధ్య సమన్వయం కొరవడింది.

సంపన్నుల సమరం

ఏప్రిల్ 17న 18వ లోక్‌సభ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ అయింది. చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల బరిలో 64 మంది నామినేషన్లు వేసి, చివరికి ఎన్నికల బరిలో 43 మంది నిలిచారు. వీరిలో ప్రధానంగా బీఆర్ఎస్ నుంచి మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పోటీ చేయగా, కాంగ్రెస్ నుంచి గడ్డం రంజిత్‌రెడ్డి, బీజేపీ నుంచి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బరిలో నిలిచారు. వీరు ముగ్గురు ఆర్థికంగా రాష్ట్రంలోనే అత్యధిక సంపన్నులు. మే 13న ఎన్నికలు నిర్వహించగా, జూన్ 4న ఫలితాలు వెల్లడయ్యాయి. నియోజకవర్గం పరిధిలో మొత్తం 29,38,370 మంది ఓటర్లకు 16,81,263 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. 12,81,263 మంది ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అనూహ్య విజయం సాధించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పట్టం కట్టిన ఓటర్లు.. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేశారు. అప్పటి వరకు చేవెళ్ల టికెట్‌ను ఆశించి, తీరా మల్కాజిగిరి నుంచి పోటీ చేసిన వికారాబాద్ జెడ్పీ మాజీ చైర్ పర్సన్ పట్నం సునీతారెడ్డి కూడా బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ చేతిలో పరాజయం పాలయ్యారు. ఈ రెండు ఓటములు అధికార కాంగ్రెస్‌కు మింగుడుపడ లేదు.

వారికి కలిసి వచ్చింది

డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి సహా ఎల్బీనగర్ సీనియర్ నేత మల్‌రెడ్డి రాంరెడ్డి, బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు కార్పొరేషన్ పదవులు దక్కాయి. పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ చైర్మన్‌గా చల్లా నియమితులు కాగా, రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా మల్‌రెడ్డి రామిరెడ్డి, ముదిరాజ్ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా జ్ఞానేశ్వర్ నియమితులయ్యారు. ఇక సీఎం రేవంత్ అనుచరులుగా గుర్తింపు పొందిన ఇద్దరు యువ నేతల్లో ఒకరికి జిల్లా గ్రంథాలయ సంస్థ, మరొకరికి పండ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులు దక్కాయి. ఇదిలా ఉంటే జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున గెలుపొందిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితోపాటు కల్వకుర్తి, షాద్‌నగర్ ఎమ్మెల్యేలకు మంత్రి మండలిలో చోటు దక్కకపోవడం ఆ పార్టీ నేతలను కొంత నిరాశకు గురి చేసింది.



మొయినాబాద్ రూరల్: హిమాయత్‌నగర్ సమీపంలోని రహదారిపై కురుస్తున్న వర్షం

రోజంతా కూల్

- మారిన వాతావరణం
- ఉదయం మబ్బులు
- సాయంత్రం జల్లులు
- చలికి గజగజ వణికిన జనం
- తగ్గిన విద్యుత్ వినియోగం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో గురువారం ఉదయం నుంచి రోజంతా ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం మబ్బులు కమ్మేసి ఉండటం.. సాయంత్రం ఒక్కసారిగా వర్షం కురవడంతో అప్పటికే వివిధ పనుల కోసం బయటికి వెళ్లిన వాహనదారులు, వీధి వ్యాపారులు, పాదచారులు తడిసి ముద్దయ్యారు. సుమారు గంటన్నర పాటు కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చిరుజల్లులకు చలి గాలులు తోడవడంతో చిన్నారులు, వృద్ధులు గజగజ వణికిపోయారు. చలికారణంగా ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు ఆఫ్ చేశారు. ఫలితంగా రోజు వారీ విద్యుత్ వినియోగం గణనీయంగా తగ్గింది. డిసెంబర్ 19న అత్యధికంగా 3,145 మెగావాట్ల (60.25 మిలియన్ యూనిట్లు) డిమాండ్ నమోదు కాగా, 25న అత్యల్పంగా 3,039 మెగావాట్లు (57.58 ఎంయూ)లు రికార్డు అయింది. తాజాగా గురువారం 2,940 మెగావాట్లు నమోదు కావడం గమనార్హం. అర్ధరాత్రి, మధ్యాహ్నం వేళతో పోలిస్తే ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యుత్ డిమాండ్ ఎక్కువగా నమోదవుతుండటం విశేషం. వేడినీళ్ల కోసం గీజర్లు, హీటర్లు వాడుతుండటమే ఇందుకు కారణమని ఇంజనీర్లు చెబుతున్నారు.

ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి



ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోదండరాం

కవాడిగూడ: సమగ్ర శిక్షా ఉద్యోగులు, ఉపాధ్యాయినులు, గిరిజన ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్ల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపాదికన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షా ఉద్యోగులు, ఉపాధ్యాయినులు, గిరిజన ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని గురువారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాకు ఎమ్మెల్సీ కోదండరాం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమగ్ర శిక్షా ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తమవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యా, పరిరక్షణ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ, తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, ఎంపీఎఫ్ కన్వీనర్ ఆర్.వెంకట్‌రెడ్డి, సర్వశిక్షా అభియాన్ రాష్ట్ర అధ్యక్షుడు దుండిగల్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఝాన్సీ, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



టీఎస్‌డీడీసీఎఫ్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న పాడిరైతులు, నాయకులు

పాడి పరిశ్రమాభివృద్ధికి కృషి

- టీఎస్‌డీడీసీఎఫ్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి

కడ్తాల్: పాడి పరిశ్రామిభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య (టీఎస్‌డీడీసీఎఫ్) చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్రాన్ని గురువారం ఉదయం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి పాల సేకరణ వివరాలను మెనేజర్ రాధికను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాడి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాడి రైతుల సంక్షేమమే లక్ష్యంగా సమాఖ్య పనిచేస్తుందని పేర్కొన్నారు. స్థానిక విజయ డెయిరీ పరిధిలో పాడి రైతులకు సకాలంలో పాలబిల్లులు అందక అనేక ఇబ్బందులు పడుతున్నారని డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా, పాడి రైతు సంఘం నాయకుడు కడారి రామకృష్ణ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పాడిరైతుల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కడ్తాల్ విజయ సొసైటీ అధ్యక్షుడు చేగూరి వెంకటేశ్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీలకు సిద్ధం

గన్‌ఫౌండ్రీ: నగరంలోని ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న సీఎం కప్‌- 2024 పోటీలకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. శుక్రవారం నుంచి జనవరి 2వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి పోటీలను పండగ వాతావరణంలో నిర్వహించాలని స్పోర్ట్స్ అథారిటీ భావిస్తోంది.

రెండు ఆటోలను ఢీకొట్టిన కారు

ఐదుగురికి గాయాలు

ఇబ్రహీంపట్నం: అతివేగంగా వస్తున్న కారు రెండు ఆటోలను ఢీకొట్టడంతో పలువురికి గాయాలైన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నాగరాజు తెలిపిన కథనం ప్రకారం.. గురువారం రాత్రి ఇబ్రహీంపట్నం నుంచి గుమ్మడవెల్లికి వెళ్తున్న కారు గురునానక్ కాలేజ్ సమీపంలో ఎదురుగా వస్తున్న రెండు ఆటోలను ఢీకొట్టింది. మొదట ఢీకొట్టిన ఆటో మాడ్గుల మండలం ఫకీర్ తండా నుంచి వస్తోంది. అందులో ప్రయాణిస్తున్న కిషన్, బుజ్జి, నిరోషాకు గాయాలయ్యాయి. మీర్‌పేట్ జిల్లెలగూడలో నివసించే ఐదుగురు కూలీలను తీసుకొని కుర్మేండ్‌లో నిర్మాణ పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా రెండో ఆటో ప్రమాదానికి గురైంది. ఆటోలోని వెంకటరత్నమ్మ, శ్రీనుకు గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను నగరంలోని ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకొని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.



కారు ఢీకొట్టడంతో ధ్వంసమైన ఆటో

'ఆట'ంకం!

- ఆటస్థలాల్లో సభలు, విజయోత్సవాలు
- వేదికగా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం
- క్రీడాకారుల సాధనకు అవరోధం
- నిరోధించాలంటున్న క్రీడాభిమానులు



సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం

హుడాకాంప్లెక్స్: ఆట మైదానాలు సభలు, సమావేశాలు, విజయోత్సవాలకు వేదికగా మారుతున్నాయి. క్రీడాకారులు.. కోచ్‌లు.. క్రీడాభిమానులతో నిత్యం కళకళలాడాల్సిన స్టేడియాలు మైక్‌లు, నినాదాలు, డీజేల హోరుతో దద్దరిల్లిపోతున్నాయి. క్రీడా మైదానాల్లో ఎలాంటి సభలు, సమావేశాలకు అనుమతి ఇవ్వబోమని సాక్షాత్తు ముఖ్యమంత్రి చెప్పినా ప్రయోజనం లేకుండా పోయింది. ఆయా నేతల ఒత్తిళ్లకు తలొగ్గి జిల్లా క్రీడల శాఖ అధికారులు అడ్డగోలుగా వేడుకలకు కేటాయిస్తున్నారు. ఫలితంగా ఆయా క్రీడాంశాల్లో శిక్షణ పొందుతున్న భావి క్రీడాకారులకు ×ఆట×ంకం తప్పడం లేదు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం క్రీడలకు విరుద్ధంగా రాజకీయ బహిరంగ సభలు, సమావేశాలు, సినిమా విజయోత్సవాలు, పాటల కచేరీలకు అడ్డాగా మారుతోంది.

పలు క్రీడాంశాల్లో శిక్షణ

క్రీడాకారులకు శిక్షణ ఇచ్చి, ప్రోత్సహించేందుకు 23 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం ఎల్బీనగర్ సమీపంలోని 17 ఎకరాల్లో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియాన్ని ఏర్పాటు చేసింది. ఇండోర్ సహా అవుట్‌డోర్ స్టేడియాలు ఉన్నాయి. ఇక్కడ క్రికెట్, జిమ్నాస్టిక్స్, అథ్లెటిక్స్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కరాటే, స్కేటింగ్, స్విమ్మింగ్ పోటీల్లో శిక్షణ ఇస్తుంటారు. ఆరేళ్ల వయసు వారి నుంచి అరవై ఏళ్ల వయసు వారు కూడా ఆయా అంశాల్లో సాధన చేస్తుంటారు. క్రీడాకారుల సంక్షేమం, అభివృద్ధి కోసం పాటుపడాల్సిన స్టేడియం పూర్తిగా రాజకీయ, సినిమా, కార్పొరేట్ స్కూళ్ల వార్షికోత్సవాలు, సభలకు, సమావేశాలకు పరిమితం అవుతోంది.

శిక్షణకు తప్పని ఇబ్బంది

నిర్వాహకులు సభాస్థలి కోసం రెండు రోజుల ముందు నుంచే ఏర్పాట్లు చేస్తుంటారు. షామియానా, కుర్చీలు, బారికేడ్లు, కటౌట్లు, ఫ్లెక్సీలతో నింపుతున్నారు. బహిరంగ సభ/ సమావేశానికి రెండు రోజుల ముందు, ఆ తర్వాత మరో రెండు రోజుల పాటు ప్రాక్టీసును నిలిపేయాల్సి వస్తోంది. ఆహ్లాదంగా, ప్రశాంతంగా ఉండాల్సిన స్టేడియం డీజే సౌండ్స్‌తో మోతమోగుతోంది. క్రీడాకారులే కాదు చుట్టుపక్కల వారి ప్రశాంతతను దెబ్బతీస్తున్నాయి.



ఓ సభ కోసం ఏర్పాట్లు (ఫైల్)

వాకింగ్‌కు కష్టమవుతోంది



ఇంటికి సమీపంలోనే స్టేడియం ఉంది. నాతో పాటు చుట్టుపక్కల ఉన్న వాళ్లంతా ప్రతిరోజు ఇక్కడికి వాకింగ్‌కు వస్తుంటాం. సభలు, సమావేశాలు నిర్వహించడంతో క్రీడాకారులతో పాటు నిత్యం వాకింగ్ చేసే వారు ఇబ్బంది పడాల్సి వస్తోంది. పారిశుద్ధ్య సమస్యకు తోడు ట్రాఫిక్, శబ్ద కాలుష్యం తలెత్తుతోంది.

– డాక్టర్ ఏపీ చారి, డాక్టర్స్‌కాలనీ

శిక్షణకు దూరమవుతున్నారు



స్టేడియంలో మా పిల్లలకు స్కేటింగ్‌లో శిక్షణ ఇప్పిస్తున్నాం. ఒక్కొక్కరికి నెలకు రూ.1,500 ఫీజు చెల్లిస్తున్నాం. ప్రతిరోజు ఉదయం ప్రాక్టీసు చేయించాల్సి ఉంది. సభలు, సమావేశాలకు స్టేడియాన్ని కేటాయిస్తుండటంతో నెలలో నాలుగైదు రోజులు శిక్షణకు దూరమవ్వాల్సి వస్తోంది.

– గుర్రం చంద్రశేఖర్, పేరెంట్

బయటే కేటాయించాలి



క్రీడాకారులకు ఉపయోగపడాల్సిన మైదానాలు రాజకీయ శిబిరాలకు వేదికగా మారుతుండటం దురదృష్టకరం. సభలు, సమావేశాలకు అవుటర్ బయటే అవకాశం ఇవ్వాలి. క్రీడాకారులకు కేటాయించిన మైదానాల్లో వారికే ప్రాధాన్యం దక్కాలి.

– ఎం.సుకుమార్, బ్యాడ్మింటన్ క్రీడాకారుడు

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

- ప్రశ్నించిన పాపానికి కర్రతో దాడి చేసిన భర్త
- దెబ్బలు తాళలేక మృతిచెందిన భార్య
- పోలీస్ స్టేషన్ ఎదుట బంధువుల ఆందోళన



మహేశ్వరం పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు


సంతోష మృతదేహం

మహేశ్వరం: వివాహేతర సంబంధాన్ని ప్రశ్నించినందుకు కోపోద్రిక్తుడైన భర్త విచక్షణా రహితంగా కర్రతో దాడి చేయడంతో భార్య మృతి చెందింది. ఈ సంఘటన మండల పరిధిలోని గంగారం పంచాయతీ మైలార్‌బాయితండాలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, స్థానికుల వివరాల ప్రకారం.. తండాకు చెందిన సభావత్ సంతోష్‌నాయక్‌కు, మహేశ్వరం మండలం మైలార్‌బాయితండాకు చెందిన సంతోష(25)తో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. అప్పట్లో కట్నం కింద సంతోష్‌నాయక్‌కు రూ.8 లక్షలు ఇచ్చారు. వీరికి ఒక కుమార్తె, కుమారుడు సంతానం. వివాహం జరిగిన కొద్ది నెలల వరకు దంపతులు అన్యోన్యంగానే ఉన్నారు. ఆ తర్వాత సంతోష్‌నాయక్ ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని, సంతోషను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. ఈ విషయమై ఈనెల 23న సంతోష భర్తను గట్టిగా నిలదీసింది. దీంతో ఆగ్రహానికి గురైన సంతోష్ ఆమెపై కర్రతో తీవ్రంగా కొట్టి, మండల కేంద్రంలోని పోతర్ల బాబయ్య ఫంక్షన్ హాలు వద్ద వదిలి వెళ్లిపోయాడు. దీంతో బాధితురాలు మహేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

న్యాయం చేయాలని..

సంతోష్‌నాయక్ కొట్టిన దెబ్బలు తాళలేక సంతోష బుధవారం రాత్రి మృతి చెందింది. దీంతో నిందితుడిని అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మృతురాలి బంధువులు గురువారం ఉదయం పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ మేరకు పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సంతోష్‌నాయక్‌పై కేసు నమోదు చేశామని సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ మధుసూదన్ తెలిపారు.

రాంగ్‌రూట్‌లో వచ్చి.. బస్సును ఢీకొట్టి

బిహార్ కార్మికుడి దుర్మరణం, మరొకరికి తీవ్ర గాయాలు


ఘటనాస్థలిలో పడి ఉన్న శోభాదాస్ మృతదేహం

నందిగామ: ద్విచక్రవాహనంపై రాంగ్ రూట్‌లో వచ్చి ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన ప్రమాదంలో ఓ కార్మికుడు దుర్మరణం చెందిన ఘటన మండల పరిధిలోని పాత జాతీయ రహదారిపై రాయలసీమ పరిశ్రమ సమీపంలో చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ కథనం ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన శోభాదాస్(35), శంబుదాస్‌లు స్నేహితులు. వీరు కొత్తూరులో నివాసం ఉంటున్నారు. శోభాదాస్ వీర్లపల్లి శివారులోని మహవీర్ పరిశ్రమలో, శంబుదాస్ కొత్తూరు సమీపంలోని వినాయక స్టీల్ పరిశ్రమలో కార్మికులుగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం పని నిమిత్తం అయ్యప్ప స్వామి టెంపుల్ వైపు నుంచి నందిగామ వైపునకు ఇద్దరు బైక్‌పై రాంగ్‌రూట్‌లో వెళ్తున్నారు. ఈ క్రమంలో స్థానిక రాయలసీమ ఐరన్ పరిశ్రమ సమీపంలో షాద్‌నగర్ నుంచి కొత్తూరుకు వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న శోభాదాస్ అక్కడికక్కడే దుర్మరణం చెందగా.. శంబుదాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రుడిని స్థానికులు 108 అంబులెన్స్‌లో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు మృతుడి సోదరుడు శ్రావణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్‌లోని కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

యాచారం: రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో తీవ్ర గాయాలైన ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉట్లపల్లి గ్రామానికి చెందిన గుంపెన యాదగిరి(25) ఈ నెల 24న సాయంత్రం తన స్వగ్రామం నుంచి బైక్‌పై కటికపల్లి గ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో సార్లరావులపల్లి గ్రామ సమీపంలో ఎదురుగా వచ్చిన ఓ బైకు ఢీకొట్టింది. ఈ సంఘటనలో యాదగిరికి తీవ్ర గాయాలై నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణంరాజు తెలిపారు.

‘సర్కిల్’లో పర్యవేక్షణ కరువు!

- ఈ నెల 11 నుంచి ఖాళీగా ఇబ్రహీంపట్నం సీఐ కుర్చీ
- రోజురోజుకూ పెరుగుతున్న కేసులు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు



ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్

ఇబ్రహీంపట్నం రూరల్: నియోజకవర్గ కేంద్రమైన ఇబ్రహీంపట్నం ఠాణాలో స్టేషన్‌హౌస్ అధికారి లేక ఇబ్బందులు తప్పడం లేదు. నిత్యం పోలీస్ స్టేషన్‌కు వచ్చే కేసుల పురోగతిని పర్యవేక్షించడం కరువైంది. దీని ప్రభావం నేరాల నియంత్రణపై పడే అవకాశం ఉందని స్థానికులు భావిస్తున్నారు. ఇటీవల కానిస్టేబుల్ నాగమణి మర్డర్ కేసును ఛేదించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న కారణంతో ఈ నెల 11న రాచకొండ కమిషనర్ ఇక్కడ పనిచేసే సీఐ సత్యనారాయణను కమిషనరేట్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు వెల్లడించారు. అప్పటి నుంచి ఇబ్రహీంపట్నం సీఐ కుర్చీ ఖాళీగానే దర్శనమిస్తోంది. నిత్యం నిర్వహించాల్సిన పోలీసు కార్యచరణ భారమంతా అడ్మిన్ ఎస్‌ఐ మీదే పడుతుంది.

జవాబుదారీ కరువు

క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సీఐ సత్యనారాయణ వెళ్లి పోయి 15 రోజులు గడుస్తుంది. కానీ నేటికీ ఇక్కడికి పోస్టింగ్ ఇవ్వకపోవడంపై ఆసక్తి నెలకొంది. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోకి మండలంలోని 14 గ్రామాలు, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ 24 వార్డులు, ఆదిబట్ల మున్సిపాలిటీలోని 3 వార్డులు వస్తాయి. సుమారు 60 వేలకు పైగా జనాభా ఉంటుంది. నిరంతరం నాగార్జున సాగర్ జాతీయ రహదారి వెంట ఏదో ఓ చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. గంజాయి, పేకాట, చోరీలు, హత్యలు, మోసాల తదితర కేసులు సైతం ఇటీవల ఎక్కువగానే నమోదవుతున్నాయి. గత 15 రోజుల్లోనే 30కి పైగానే వివిధ రకాల కేసులు నమోదయ్యాయి. ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో ముగ్గురు విద్యార్థులు అదృశ్యమైన కేసు సంచలనంగా మారింది. స్టేషన్ హౌజ్ అధికారి ఉంటే దర్యాప్తు సమయంలో జవాబుదారీగా ఉండేది.

మంచాల సీఐకి అదనపు బాధ్యతలు

మంచాల సీఐ మధుకు ఇబ్రహీంపట్నం అదనపు బాధ్యతలు అప్పగించారు. మంచాలలో కూడా అనేక కేసులు, నిత్యం ఏదో ఒక పంచాయతీలతో పోలీస్‌స్టేషన్ బిజీగా ఉంటుంది. అక్కడ ఇక్కడ పని చేయడం తలకు మించిన భారంగా మారుతుంది. విధి నిర్వహణలో భాగంగా ఉదయం ఎనిమిది గంటలకు వస్తే రాత్రి పది గంటలకు ఇంటికి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. రెండు రోజులుగా మంచాల సీఐ సెలవులపై వెళ్లడంతో యాచారం సీఐకి ఇబ్రహీంపట్నం బాధ్యతలు అప్పగించారు. ఇలా ఒకరికి కాకపోతే మరొకరికి అదనపు బాధ్యతలతో సరి పెడుతున్నారు. ఇబ్రహీంపట్నానికి శాశ్వత సీఐని కేటాయించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

జోరుగా పైరవీలు

ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ నగరానికి కూతవేటు దూరంలో ఉంటుంది. దీంతో సిటీలో ఉండే అధికారులు త్వరగా వచ్చి వెళ్లి పోవచ్చనే ఉద్దేశంతో పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. కొంత మంది స్థానిక ఎమ్మెల్యే లెటర్ కోసం తిరుగుతున్నట్లు తెలిసింది. అలాగే మంత్రులు, డీజీ, ఐజీ స్థాయి అధికారుల చుట్టూ ఆశావహులు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎమ్మెల్యే స్థానికంగా లేకపోవడంతో సీఐ నియామకం ఆలస్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది.

సీపీ నిర్ణయం తీసుకోవాలి



ఇబ్రహీంపట్నం సీఐని అటాచ్ చేసిన విషయం విదితమే. ఆయన స్థానంలో కొత్త వారు రావాల్సి ఉంది. దీని కోసం ప్రభుత్వం, రాచకొండ పోలీస్ కమిషనర్ నిర్ణయం తీసుకోవాలి. ప్రస్తుతం ఠాణా సక్రమంగా నడుస్తోంది. నిత్యం పర్యవేక్షిస్తున్నాను. కమిషనర్ నుంచి ఉత్తర్వులు వెలువడగానే కొత్త సీఐ వస్తారు.

– కేపీవీ రాజు, ఏసీపీ, ఇబ్రహీంపట్నం

సీఎం సలహాదారుడిని కలిసిన ‘చిలుక’



అబ్దుల్లాపూర్‌మెట్: ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం గచ్చిబౌలిలోని ఆయన నివాసంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. పండ్ల బుట్ట అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి.. డివైడర్‌ను ఢీకొని

ఒకరి దుర్మరణం


అనంతయ్య (ఫైల్)

చేవెళ్ల: బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లారెడ్డిగూడ బస్‌స్టేజీకి సమీపంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షాద్‌నగర్ పట్టణానికి చెందిన దప్పు అనంతయ్య(50) బైక్‌పై వ్యక్తిగత పని నిమిత్తం బుధవారం చేవెళ్ల వైపు వచ్చి రాత్రి తిరిగి వెళ్తున్నాడు. మార్గమధ్యలో మల్లారెడ్డిగూడ బస్‌స్టేజీ సమీపంలో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన ఎగిరి కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి 108 అంబులెన్స్, పోలీసులకు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ మేరకు పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భార్యే చంపేసింది..

- గుర్తు తెలియని మృతదేహం కేసులో వీడిన మిస్టరీ
- వేధింపులు తాళలేక..
- సోదరితో కలిసి మృతుడి భార్య ఘాతుకం


ముంతాజ్ ఆలం (ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి: గుర్తు తెలియని వ్యక్తి హత్య కేసులో మిస్టరీ వీడింది. తన సోదరితో కలిసి మృతుడి భార్య ఈ ఘాతుకానికి పాల్పడినట్లు గుర్తించారు. గురువారం నిందితులను అరెస్ట్ చేసిన మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ నరేందర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దుర్గానగర్ చౌరస్తా నుంచి ఆరాంఘర్ చౌరస్తా వెళ్లే దారిలో హ్యాపీ వైన్స్ ఎదురుగా ఉన్న డ్రైనేజీ కాలువలో గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా వెళ్లిన పోలీసులు సంచిలో కుళ్లిన స్థితిలో ఉన్న వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. నాలుగు రోజుల క్రితమే ఎక్కడో హత్య చేసి ఇక్కడికి తీసుకువచ్చి పారవేసినట్లు గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాలను పరిశీలించగా ఈ నెల 21న తెల్లవారుజామున ఇద్దరు మహిళలు మృతదేహంతో ఉన్న సంచిని తీసుకువచ్చి డ్రైనేజీలో పారవేసినట్లు వెల్లడైంది. దీని ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు.

వేధింపులు తాళలేకే..

బిహార్ రాష్ట్రానికి చెందిన మహ్మద్ ముంతాజ్ ఆలం(40), రౌషన్ ఖాతున్ దంపతులు నగరానికి వలస వచ్చి ఉద్దెంగడ్డ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. ముంతాజ్ ఆలం అదే ప్రాంతంలోని చికెన్ సెంటర్‌లో పని చేసేవాడు. మద్యానికి బానిసైన అతను తరచూ భార్యతో గొడవపడటమేగాక ఆమెను కొట్టేవాడు. ఈ విషయాన్ని ఆమె తన సోదరి అక్క రవీనా బీబీకి చెప్పింది. ఈ నెల 20న మద్యం తాగి ఇంటికి వచ్చిన ముంతాజ్ ఆలం నిద్ర పోతుండగా రౌషన్ ఖాతున్, రవీనా బీబీ నవారు తాడుతో అతని గొంతుకు ఉరి బిగించి హత్య చేశారు. అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా నవారు తాడుతో కాళ్లు, చేతులు కట్టి సంచిలో కుక్కి 21న తెల్లవారుజామున లక్ష్మిగూడ చౌరస్తాకు చేరుకున్నారు. ప్యాసింజర్ ఆటోలో ఎక్కి దుర్గానగర్ చౌరస్తా నుంచి ఆరాంఘర్ వైపు వెళ్లే దారిలో దిగిన వారు డ్రైనేజీలో సంచిని పారవేసి వెళ్లిపోయారన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

క్యాలండర్ ఆవిష్కరణ

మైలార్‌దేవ్‌పల్లి: హైదరాబాద్ పాలమూరు కురువ సంఘం ఆధ్వర్యంలో బాబుల్‌రెడ్డినగర్ కాలనీలోని పోచమ్మ ఆలయంలో బీర లింగేశ్వర స్వామి కల్యాణ మండపంలో హెచ్‌పీకేఎస్ నూతన సంవత్సర క్యాలండర్‌ను ఆవిష్కరించారు. సంఘం వ్యవస్థాపకుడు కొల్లంపల్లి శ్రీనివాస్ కురువ, జిల్లా అధ్యక్షుడు మాదారం కృష్ణ కురువ, జంట నగరాల అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ కురువ, నేతలు ఆనంద్, కోస్గి హనుమంతు కురువ, బాన్యనోల రామచందర్ కురువ, జేట్రం శ్రీనివాస్ కురువ, కాంతల అశోక్ కురువ, అప్ప శ్రీను కురువ తదితరులు పాల్గొన్నారు.

ఉదాసీనంగా ఉంటే ఊరుకోరు!

- రెసిడెన్షియల్ స్పేస్ కమర్షియల్‌కు వినియోగం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని కొందరు అధికారులు
- దీనిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టిన హైడ్రా బృందాలు
- కూల్చివేతలతో పాటు బాధ్యులపై చర్యలకు సిఫార్సు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ట్రాఫిక్ ఇక్కట్లు నరకం చూపిస్తున్నాయి. గణనీయంగా పెరిగిపోతున్న వాహనాలతో పాటు వాణిజ్య సముదాయాలు, అపార్ట్‌మెంట్స్‌కు సరైన పార్కింగ్ వసతి లేకపోవడం కూడా ఇందుకు ప్రధాన కారణం. దీనిపై దృష్టి పెట్టిన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ఫిర్యాదుల ఆధారంగా కూల్చివేతలు ప్రారంభించింది. దీంతో పాటు ఆ సమస్యకు మూలమైన, ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారుల అంశాన్నీ తీవ్రంగా పరిగణిస్తోంది. వీరిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సంబంధిత విభాగాలు, ప్రభుత్వంతో పాటు అవినీతి నిరోధక శాఖకు (ఏసీబీ) సిఫార్సు చేయాలని నిర్ణయించింది. జలవనరులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ లక్ష్యంగా ఏర్పాటైన హైడ్రా నగరంలోని ట్రాఫిక్ స్థితిగతుల పైనా దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే పలువురు డీఆర్‌ఎఫ్ సిబ్బంది ట్రాఫిక్ వలంటీర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. నిబంధనల ఉల్లంఘనతో పాటు తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులకు కారణమవుతున్న అంశాలను హైడ్రా పరిగణలోకి తీసుకుంటోంది. నగరంలోని అనేక వాణిజ్య సముదాయాలు, అపార్ట్‌మెంట్స్ స్థితిగతుల్ని పరిశీలిస్తే... వాటిని లభించిన అనుమతులు, ప్రస్తుతం ఉన్న నిర్మాణాల మధ్య ఎన్నో వ్యత్యాసాలు ఉంటున్నాయి. ఆయా భవనాల నిర్మాణాలు నో అబ్జక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ), ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) వచ్చే వరకు సవ్యంగానే ఉంటున్నాయి. ఈ సర్టిఫికెట్లు వచ్చిన తర్వాత మాత్రం పరిస్థితులు పూర్తిగా మారిపోతున్నాయి. సామూహిక, గృహ అవసరాలకు, పార్కింగ్ తదితర సౌకర్యాలకు కేటాయించిన స్థలం కమర్షియల్ స్పేస్‌గా మారిపోతోంది. అక్కడ చిన్న చిన్న.. ఒక్కోసారి బ్యాంకులు వంటి పెద్ద పెద్ద వాణిజ్య, వ్యాపార సంస్థలకు పుట్టుకువస్తున్నాయి. దీనిపై కన్నేసి ఉంచాల్సిన ప్రభుత్వ విభాగాలు మిన్నకుండిపోతున్నాయి. అసోసియేషన్లు, ప్లాట్లు, ఫ్లాట్ల యజమానులు ఫిర్యాదు చేసినా కొందరు అధికారులు పట్టించుకోవట్లేదు. దీనికి ప్రలోభాలు సహా అనేక కారణాలు ఉంటున్నాయి. ఇలా రెసిడెన్షియల్ నుంచి కమర్షియల్‌కు రూపుమారిన అక్రమ నిర్మాణాలపై హైడ్రా దృష్టి పెట్టింది. వీటికి సంబంధించిన ఫిర్యాదులను ఈ విభాగం స్వీకరిస్తోంది. ఇలాంటి ఫిర్యాదుల వెనుక వ్యక్తిగత కారణాలు, కక్షలు, బెదిరింపు ధోరణులు వంటివి నిగూఢంగా ఉండే ఆస్కారం ఉందని హైడ్రా అనుమానిస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రతి ఫిర్యాదునూ క్షుణ్ణంగా పరిశీలించడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసింది. నేరుగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నేతృత్వంలో పని చేసే ఈ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించడంతో పాటు రికార్డులను పరిశీలించడం ద్వారా అసలు విషయం తేలుస్తాయి. ఆపై హైడ్రా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ నేతృత్వంలో జరిగే సమావేశంలో ఫిర్యాదుదారులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు సైతం పాల్గొంటారు. దీని తర్వాత మాత్రమే తుది నిర్ణయం తీసుకుని స్థానిక అధికారుల ద్వారా హైడ్రా కూల్చివేతలు చేపడుతోంది. ఇలాంటి ‘మార్పిడులు’ కొనసాగకుండా, పునరావృతం కాకుండా ఉండాలంటే అధికారుల పైనా చర్యలు అనివార్యమని హైడ్రా నిర్ణయించింది. ఈ నేపథ్యంలో రికార్డుల ఆధారంగా ఈ వ్యవహారాలు చోటు చేసుకోవడానికి బాధ్యులుగా తేలే అధికారుల పైనా చర్యలకు సిఫార్సు చేయాలని హైడ్రా అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు


వెంకటేష్ (ఫైల్)

మాడ్గుల: పనికి వెళ్తున్నానని చెప్పి ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండలంలోని దొడ్లపహాడ్ గ్రామంలో చోటు చేసుకుంది. సీఐ జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఏదుల వెంకటేష్(26) టైల్స్ వర్కర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 15న అతడు పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో గురువారం వెంకటేష్ తండ్రి మాడ్గుల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

కేపీహెచ్‌బీకాలనీ: అరటిపండ్లు కొనుక్కుని ఇంటికి వెళుతున్న మహిళ మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి లాక్కెళ్లిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కేపీహెచ్‌బీ కాలనీ 6వ ఫేజ్‌లోని సాయి తేజ టవర్స్‌లో నివాసం ఉండే మేకమణి (54) తన స్నేహితురాలితో కలిసి బుధవారం సాయంత్రం స్థానిక విజేత సూపర్ మార్కెట్ సమీపంలో అరటిపండ్లు కొనుక్కుని ఇంటికి బయలుదేరింది. ఆమెను అనుసరిస్తూ వచ్చిన గుర్తు తెలియని యువకుడు సాయి బృందావన్ అపార్ట్‌మెంట్ సమీపంలో మణి మెడలోని బంగారు గొలుసు లాక్కుని పక్కనే ఉన్న పీవీ నరసింహారావు పార్కులోకి పరిగెత్తుకెళ్లాడు. పార్కు మరో వైపున ఉన్న గేటు ద్వారా తప్పించుకుని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేపీహెచ్‌బీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడి దుర్మరణం


శివకుమార్ (ఫైల్)

కీసర: బైక్ అదుపు తప్పి కిందపడటంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంపల్లి–చర్లపల్లి రహదారిలో చోటు చేసుకుంది. కీసర సీఐ వెంకటయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాంపల్లికి చెందిన అంకర్ల శివకుమార్ ముదిరాజ్(29) చర్లపల్లిలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి డ్యూటీ నుంచి బైక్‌పై ఇంటికి తిరిగి వెళుతుండగా మార్గ మధ్యలో బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు శివకుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే తమ గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందాడని ఆరోపిస్తూ గురువారం రాంపల్లి యువజన సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. రాంపల్లి–చర్లపల్లి రహదారి విస్తరణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా సదరు కాంట్రాక్టర్ మృతుడి కుటుంబానికి రూ 6 లక్షలు పరిహారం చెల్లించేందుకు అంగీకరించినట్లు సమాచారం.

నేటి నుంచి క్రీడా పోటీలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ మండల గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యజమాన్య సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకు సిఖ్ ఛావునీలోని గురు నానక్ హై స్కూల్ గ్రౌండ్‌లో క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు ఎం.ప్రభాకర చారి, ప్రధాన కార్యదర్శి జి.శరవణ్‌కుమార్, కోశాధికారి ఎస్.ఆర్.రజనీకాంత్, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శులు బోయ లక్ష్మణ్, వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్, విశ్రాంత ఎస్‌పీ ప్రీతం సింగ్‌లు ఈ పోటీలను ప్రారంభిస్తారన్నారు. ఫ్యాన్సీ డ్రెస్, డ్రాయింగ్, పెయింటింగ్, వ్యాసరచన పోటీలతో పాటు క్యారమ్స్, చెస్, స్పెల్ బీ, అథ్లెటిక్స్, షాట్‌పట్, మోనో యాక్షన్, వక్తృత్వ పోటీలు, కబడ్డీ పోటీలను నిర్వహిస్తామన్నారు. బాల బాలికలకు విడి విడిగా పోటీలు ఉంటాయన్నారు. జూనియర్స్, సబ్ జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో పోటీలు ఉంటాయన్నారు. ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు హైదరాబాద్ స్కాట్స్ స్కూల్‌లో నిర్వహించనుండగా... మిగతా పోటీలన్నీ గురు నానక్ హై స్కూల్‌లో నిర్వహిస్తామన్నారు. రాజేంద్రనగర్ మండలంలో ఉన్న గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల నుంచి 4000 మంది విద్యార్థినీవిద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొంటారని వారు వివరించారు.

కేంద్ర మంత్రికి సత్కారం

రాజేంద్రనగర్: నగరంలో జరిగిన సమావేశానికి హాజరయ్యేందుకు వచ్చిన కేంద్ర మంత్రి ఎస్పీ సింగ్ బాగాల్‌ను గురువారం ఉదయం రాజేంద్రనగర్‌లో బీజేపీ నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ కమిటీ కన్వీనర్ మల్లారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్, నేతలు కొమురయ్య, జగన్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.